ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 25 సెప్టెంబరు 2024

మృత్యువులోనూ ఒక్కటైన దంపతులు

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మృత్యువులోనూ ఆ దంపతుల బంధం విడిపోలేదు. హుబ్బళ్లి తాలూకా కుసుగల్ గ్రామానికి చెందిన శంకరప్ప శివప్ప హొంబళ, భార్య అన్నపూర్ణ దంపతులు. 72ఏళ్ల శంకరప్ప మంగళవారం ఉదయం గుండెపోటుకు గురై కన్నుమూశారు. ఇంటి బయట ఉన్న భార్య అన్నపూర్ణ భర్త మృత్యువార్త తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబ సభ్యులు గమనించగా అప్పుడే కన్నుమూసింది. 44ఏళ్ల వైవాహిక జీవనం గడిపిన దంపతులు మృత్యువులోనూ ఒక్కటి కావడం గ్రామంలో విషాదం నింపింది.



అనుమతితో.. అలజడి..!



- సీఎంపై విచారణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- ముడా వివాదంతో సిద్దూ ఉక్కిరిబిక్కిరి
- నేడు సీఎల్పీ అత్యవసర సమావేశం
- కేసీ వేణుగోపాల్‌తో భేటీకి అధిష్టానం ఆదేశం
- తప్పు జరిగి ఉంటే రాజీనామా తప్పదు : మంత్రి సతీశ్ జార్కిహొళి
- ఆ అవసరం లేదు: డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముడా వివాదం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మెడకు బిగుసుకుంది. హైకోర్టు ధర్మాసనం తీర్పుతో ఆయన పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ముడాలో 14 ఇంటి స్థలాలు సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట కేటాయించడం వెనుక భారీ అవినీతి చోటు చేసుకుందని అధికార దుర్వినియోగం జరిగిందని ముగ్గురు సామాజిక కార్యకర్తలు గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయనకు బ్యాడ్ టైమ్ మొదలయ్యిందని చెప్పవచ్చు. గవర్నర్, సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం షాక్‌కు గురైంది. గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేబినెట్‌లో తీర్మానం చేయడంతోపాటు సీఎం సిద్దరామయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు నెలరోజులపాటు వాయిదాలు, విచారణలు గతవారం ముగిశాయి. తీర్పు ఎలా ఉంటుందనే ఉత్కంఠకు మంగళవారం తెరపడింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ నాగప్రసన్న ముడా వివాదంలో గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడాన్ని సమర్థించారు. ఈ వివాదాన్ని రద్దు చేయాలని సీఎం సిద్దరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వంలో అలజడి నెలకొంది. సిద్దరామయ్య ఓ సమావేశంలో ఉండగానే కోర్టు తీర్పు వెలువడడంతో ఆ వెంటనే ఆయన అధికారిక నివాసానికి వెనుదిరిగారు. కాసేపట్లోనే బెంగళూరులో అందుబాటులో ఉండే డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు సీనియర్ మంత్రులు, న్యాయనిపుణులు చేరుకున్నారు. సుదీర్ఘంగా మంతనాలు జరిపారు.



సీఎల్పీ అత్యవసర భేటీ

హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం సిద్దరామయ్య అప్రమత్తమయ్యారు. మంగళవారం అందుబాటులో ఉండే మంత్రులంతా అధికారిక నివాసం కావేరికి చేరుకుని చర్చలు జరిపారు. ఈలోగా కొందరు ఎమ్మెల్యేలు, పార్టీ ప్రముఖులు కావేరికి పరుగులుతీశారు. తొలుత అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని భావించారు. కానీ కేవలం మంత్రుల నిర్ణయం మాత్రమే సమంజసం కాదని వెనుకడుగు వేశారు. దీంతో బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అత్యవసర సమావేశానికి సీఎం సిద్దరామయ్య ఆహ్వానించారు.



సీఎం కార్యాలయం కృష్ణ వద్ద బందోబస్తు

అప్రమత్తమైన అధిష్ఠానం

సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఉండడంతో ఆయన విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అధిష్టానం అప్రమత్తమయ్యింది. తీర్పుపై రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా స్పందించారు. సీఎం సిద్దరామయ్యతో ఫోన్‌లో మంతనాలు జరిపారు. అత్యవసరంగా బెంగళూరు వస్తున్నట్లు తెలిపారు. కాగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనారోగ్యం కారణంగా విశ్రాంతిలో ఉన్నారు. దీంతో ఆయన ఎటువంటి పార్టీ కార్యక్రమంలో పాల్గొనలేదు. మరోవైపు కోర్టు తీర్పుపై సిద్దరామయ్య సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, కపిల్‌సిబల్‌తో చర్చలు జరిపారు. భవిష్యత్తు కార్యాచరణపై మంతనాలు సాగించినట్లు తెలుస్తోంది. ప్రొఫెసర్ రవివర్మకుమార్‌తోపాటు పలువురు న్యాయనిపుణులు సీఎంతో చర్చలు జరిపారు.

తప్పు చేయలేదు.. రాజీనామా చేయను: సీఎం

ముడా ఇంటి స్థలాల కేసులో తాను ఎలాంటి తప్పు చేయలేదని, సీఎం పదవికి రాజీనామా చేసేది లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. కోర్టు తీర్పు తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాసనం తీర్పుపై న్యాయపోరాటం చేస్తానన్నారు. హైకోర్టు ధర్మాసనం తన పిటిషన్‌ను కొట్టేసిందన్నారు. అయితే నిజానికి విజయం ఉంటుందన్నారు. ఎటువంటి విచారణకైనా తాను సిద్ధమన్నారు. న్యాయనిపుణులతో సంప్రదిస్తున్నానన్నారు. ఈ పోరాటంలో న్యాయం లభిస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. కుట్ర రాజకీయాలకు న్యాయ పోరాటం ద్వారా సమాధానం సంతృప్తి సాధ్యమవుతుందన్నారు. పిటిషనర్ 218 బీఎన్‌ఎస్‌ఎస్, 17ఏ, 19 పిసి చట్ట ప్రకారం ప్రాసిక్యూషన్‌కు అనుమతులు కోరారన్నారు. 17ఏ విచారణల్లో వాస్తవాలు తేలితే రద్దు కానున్నాయన్నారు. రాజకీయ పోరాటంలో తనకు ప్రజలు అండగా ఉన్నారని భరోసా ఇచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. బీజేపీ-జేడీఎస్‌లు రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు పన్నారన్నారు. తాను పేదల సంక్షేమం కోరుతున్నా అని, సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నానే వేధింపులన్నారు. తన 40ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇటువంటి కక్ష సాధింపులకు పాల్పడలేదన్నారు.



కోర్టు తీర్పు అనంతరం మీడియాతో సీఎం సిద్దరామయ్య

సీఎం రాజీనామా చేయరు: డీసీఎం



ఇదే సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయరన్నారు. దేశంలో ప్రతిపక్ష నాయకులపై బీజేపీ రాజకీయ వేధింపులకు పాల్పడుతోందన్నారు. హైకోర్టులో పిటిషన్ కొట్టేసినా మంత్రివర్గమంతా సిద్దరామయ్య వెంటే ఉంటామన్నారు. రాజీనామా చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఆయన ఏ తప్పూ చేయలేదన్నారు. తామంతా సిద్దరామయ్యకు అండగా నిలుస్తామన్నారు.

తప్పు జరిగి ఉంటే రాజీనామా చేయాల్సిందే : మంత్రి సతీశ్ జార్కిహొళి

విచారణలో తప్పు నిర్ధారణ అయితే సీఎం రాజీనామా చేయాల్సి ఉంటుందని మంత్రి సతీశ్ జార్కిహొళి తెలిపారు. బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతానికి హైకమాండ్‌తోపాటు ఎమ్మెల్యేలందరూ సిద్దరామయ్యకు అండగా ఉన్నామన్నారు. విచారణలో తప్పు తేలితే రాజీనామా అనివార్యం కానుందన్నారు.

రాజీనామా కోరను: కేంద్రమంత్రి కుమారస్వామి

సీఎం సిద్దరామయ్యకు హైకోర్టులో వెనుకడుగు అయినా నైతికతగా ఏం జరగాలో వేచి చూస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి అన్నారు. సిద్దరామయ్య రాజీనామా కోరేది లేదని స్పష్టం చేశారు. ముడాలో అవినీతి జరిగిందనే విషయమై పాదయాత్రలో పాల్గొన్నానన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నదే తన ధ్యేయమన్నారు. సిద్దరామయ్య రాజీనామాకు ఒత్తిడి చేసేది లేదన్నారు. దేశంలో న్యాయ రక్షణ పొందేందుకు అందరికీ అవకాశం ఉందన్నారు. చట్ట వ్యతిరేకమైతే కోర్టు తీర్పు ఇస్తుందన్నారు. కాగా మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కోర్టు ఇంకా ఏం చెప్పాలని, నైతికంగా సిద్దరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే అవినీతి ఉందని ఆరోపించారు. మరో కేంద్రమంత్రి సోమణ్ణ మాట్లాడుతూ నా రాజకీయం తెరిచిన పుస్తకమని గొప్పలు చెప్పారని ప్రస్తుతం ఆ పుస్తకం ఎందుకు మూతపడిందని ఎద్దేవా చేశారు. హైకోర్టు ఆదేశాలను తీవ్రంగా పరిగణించి సిద్దరామయ్య రాజీనామా చేయాలన్నారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మాట్లాడుతూ దళితుల భూమిని పొంది సిద్దరామయ్య తప్పు చేశారని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ భార్య పేరిట 14 ఇంటి స్థలాలను పొందారన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా రాజకీయప్రేరితమైన దురుద్దేశంతో ఆరోపణలు చేశారన్నారు.



బెంగళూరులోని బీజేపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సీఎం రాజీనామా కోరుతూ బీజేపీ ధర్నా

హైకోర్టులో సీఎం పిటిషన్ తిరస్కరణకు గురి కావడంతో సిద్దరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ నిరసనకు దిగింది. ప్రతిపక్షనేత అశోక్, పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, సీటీ రవి తదితరులు ఆందోళనకు సిద్ధమయ్యారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలించారు. మైసూరులో పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయగా పోలీసులు కట్టడి చేశారు.

నేనంటే.. నేనన్నారు..!

- అవకాశం వదులుకుంటారా..
- సీఎం మార్పు జరిగితే సీటు ఎవరికో..?

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మరోసారి సీఎం కుర్చీపై రచ్చ మొదలయ్యింది. పార్టీ అధికారంలోకి రాగానే సీఎం ఎంపిక కోసం అధిష్ఠానం నానా హైరానా పడిన సంగతి తెలిసిందే. సీఎం పదవి కోసం డీకే శివకుమార్ పట్టు పట్టగా ఆయన్ని బుజ్జగించిన అధిష్ఠానం సిద్దరామయ్యకు పదవి అప్పగించింది. అయితే కోర్టు తీర్పుతో ఆశావహుల్లో మళ్లీ ఆశలు చిగురించినట్లయ్యింది. హైకోర్టులో ముడా వివాదంపై విచారణకు స్వీకరించిన సమయంలోనే నేనే ముఖ్యమంత్రి అంటూ పలువురు తెరపైకి వచ్చారు. ప్రస్తుతం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్ ద్వారా విచారణ ఎదుర్కోవాల్సి వస్తే ఎంతమంది పావులు కదుపుతారనేది చర్చనీయాంశంగా మారింది. పరమేశ్వర్ స్థానిక నేతలతో సంబంధం లేకుండా రాహుల్‌గాంధీతో రహస్య చర్చలు, మూడు వారాల వ్యవధిలో సతీశ్ జార్కిహొళి మూడుసార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం, ఢిల్లీలో ముఖ్యమంత్రి ఉండగానే ప్రధానమంత్రితో డీసీఎం డీకే శివకుమార్ భేటీ కావడం వంటి అంశాలు ఎవరికివారుగా కుర్చీపై కన్నేసిన విధానమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేబినెట్‌లో లేకున్నా ఆర్‌వీ దేశ్‌పాండే, బసవరాజరాయరెడ్డిలు సైతం తమకూ అనుభవం ఉందని ప్రకటిస్తున్నారు. రాజకీయాల్లో ఎవరేం సన్యాసులు కాదని, అవకాశం వస్తే వదులుకునేది లేదని పలుమార్లు పరమేశ్వర్ సహా కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తాత్కాలికంగా సీఎం సిద్దరామయ్య హైకోర్టు ఉన్నత పీఠానికి లేదా సుప్రీం ధర్మాసనాన్ని ఆశ్రయించవచ్చు. ఈలోగా ప్రాథమిక విచారణలో భాగంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉన్నా ఇప్పటికే మైసూరు లోకాయుక్త పోలీసులకు స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైనా మరోవైపు ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉండే పిటిషన్ విచారణ పరంగా వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం హైకోర్టు విచారణకు అనుమతులు ఇవ్వడంతో ప్రజాప్రతినిధుల కోర్టు జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ఇలా అన్ని విధాలా సిద్దరామయ్యకు ఉచ్చు బిగించినట్లు అవుతోంది. కాగా రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరుకు హడావుడిగా రానున్నారు. రాజకీయ కల్లోలంకు అవకాశాలు ఇవ్వరాదనే ఆయన రంగంలోకి దిగుతున్నారు. ఎమ్మెల్యేలందరూ క్రమశిక్షణతో సీఎల్పీకి హాజరైతే పెను సమస్య తప్పినట్లు అవుతుంది. గ్రూపులు ఏర్పడి కారణాలు చూపి గైర్హాజరైతే సిద్దరామయ్య ప్రభుత్వానికి గండం తప్పదని చెప్పవచ్చు. అధిష్ఠానం సుర్జేవాలా ద్వారా సందేశం పంపిందా లేదా కేరళలోని మలప్పురంలో ఉండే కేసీ వేణుగోపాల్ ద్వారా సమస్య చెప్పించనుందా అనేది వేచి చూడాల్సి ఉంది. సీఎల్పీ ముగిశాక సిద్దరామయ్య మలప్పురం వెళ్లే అవకాశం ఉందని పార్టీలో చర్చలు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో వివరాలు తేలే అవకాశం ఉంది.

సంబరాల దసరా



- ఈ ఏడు ఆడంబరంగా దసరా వేడుకలు
- ముస్తాబవుతున్న రాచనగరి
- 21 రోజులు విద్యుత్ దీపాలంకరణ
- ఈసారి డ్రోన్ షో ప్రత్యేకం

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక మైసూరు దసరా ఉత్సవాలు ఈ ఏడాది ఆడంబరంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలాఖరుకు మైసూరును సర్వాంగ సుందరంగా అలంకరణ చేయనున్నారు. దసరా ఉత్సవాల వేళ నగరవ్యాప్తంగా 21 రోజులపాటు దీపాలంకరణ కొనసాగించనున్నారు. తొలిసారిగా భారీస్థాయిలో డ్రోన్‌షోను ఏర్పాటు చేయనున్నారు. బన్నిమంటపం, దివిటీల ప్రదర్శన మైదానంలో అక్టోబరు 6, 7, 11, 12 తేదీల్లో డ్రోన్‌షో రాత్రి 8 గంటలకు ఏర్పాటు చేయనున్నారు. తొలి రెండు రోజులు ఉచితంగా డ్రోన్‌షో తిలకించే అవకాశం ఉంది. దసరా జంబూ సవారి రిహార్సల్స్, జంబూ సవారి రోజున కూడా డ్రోన్‌షో కొనసాగనుంది.

130 కిలోమీటర్ల మేర విద్యుత్ వెలుగులు



దీపాలంకరణతో సిద్ధమవుతున్న మైసూరు వీధులు

ఈ సారి వినూత్నంగా 130 కిలోమీటర్ల మేర విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయనున్నారు. మైసూరు నగరంలోని కీలక ప్రాంతాలతోపాటు ప్రముఖ రోడ్లు, ప్యాలెస్‌తోపాటు నగరమంతటా విద్యుత్ దీపాలంకరణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కార్యాచరణ కొనసాగుతోంది. ఈనెల 26నుంచి దసరా మహోత్సవాలను వీక్షించేందుకు జిల్లా యంత్రాంగం దసరా గోల్డ్‌కార్డులను విడుదల చేయదలిచింది. 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది. ప్రతి గోల్డ్‌కార్డు రూ.6,500గా నిర్ణయించారు. గోల్డ్‌కార్డు పొందినవారు జంబూసవారీ, దివిటీల ప్రదర్శన, జూ, చాముండి కొండలు, ప్యాలెస్‌ను ఉచితంగా సందర్శించే అవకాశం ఉంది. ప్యాలెస్ ఆవరణలో జంబూసవారి వీక్షించేందుకు రూ.3,500గాను, దివిటీలప్రదర్శన వెయ్యి రూపాయల టిక్కెట్‌గా నిర్ణయించారు. అందరికీ టిక్కెట్‌లు లభించాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ వెయ్యి టిక్కెట్లు విడుదల చేస్తున్నారు.

అలరించనున్న డ్రోన్ వెలుగులు

ఎల్‌ఈడీ బల్బులు అమర్చి 1500 డ్రోన్‌ల ద్వారా పలు విన్యాసాలు చేయనున్నారు. మైసూరు ప్యాలెస్, చాముండికొండలు, జంబూసవారి ఊరేగింపుతోపాటు ప్రభుత్వ గ్యారెంటీ పథకాల కళాఖండాల విన్యాసాలను ప్రజలు వీక్షించేలా డ్రోన్‌ల ద్వారా ప్రదర్శించనున్నారు. దసరా విద్యుత్ దీపాలంకరణకు రూ.9.5 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 6.50 కోట్ల రూపాయలు దీపాలంకరణకు, డ్రోన్ షోకు 3 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఆహ్వానించారు.



కొయ్య అంబారీతో మైసూరు వీధుల్లో ఏనుగుల రిహార్సల్స్




ప్యాలెస్ నుంచి బయటకు వస్తున్న గజరాజులు

పదిరోజులపాటు సంబరాలు

దసరా ఉత్సవాలు పదిరోజులపాటు నిర్వహించనున్నారు. అక్టోబరు 3న గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శైలవ్రతం ఉదయం 10.15 నుంచి 10.36 గంటల మధ్యన చాముండి కొండల్లో చాముండేశ్వరి దేవికి పూజలు (జయలక్ష్మి వ్రతం) జరపనున్నారు. ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య వేడుకలను లాంఛనంగా ప్రారంభిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు ప్యాలెస్‌లో పూజలు కొనసాగుతాయి. అక్టోబరు 12న శనివారం విజయదశమిని పురస్కరించుకుని నంది ధ్వజానికి మధ్యాహ్నం సీఎం సిద్దరామయ్య పూజలు చేస్తారు. సా యంత్రం జంబూ సవారీకి పుష్పార్చన జరగనుంది. కాగా ప్యాలెస్‌కు చేరుకున్న గజరాజులు ప్రతిరోజూ రిహార్సల్స్‌లో పాల్గొంటున్నాయి. జంబూసవారిలో బంగారు అంబారిని మోసే అభిమన్యుకు ప్రత్యేకంగా ఇసుక బస్తాలతోనూ, కొయ్య అంబారితో శిక్షణ ఇస్తున్నారు. మొత్తానికి ఈ ఏడు దసరా వేడుకలు ప్రజలను అత్యంత సుందరంగా అలంరించనున్నాయి.

యువ దసరా స్థల మార్పు

యువదసరాను మహారాజ కళాశాల మైదానానికి బదులుగా నగర శివారుకు మార్పు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. మహారాజ కళాశాల చుట్టూ పార్కింగ్ వ్యవస్థ లేనందున ఈ ఏడాది యువదసరాను ఉత్తనహళ్ళి వద్ద ఉండే వంద ఎకరాల ఖాళీ ప్రదేశంలో భారీ వేదిక ఏర్పాటు చేయదలిచారు.







ప్రముఖుల గీతాలాపన

అక్టోబరు 6న ప్రముఖ గాయని శ్రేయాఘోషల్ సంగీత కచేరి ఉంటుంది. 7న సంగీత దర్శకులు రవి బస్రూరుచే శాండల్‌వుడ్ నైట్ జరగనుంది. 8న బాద్‌షా సంగీత కార్యక్రమం కొనసాగనుంది. 9న ఏఆర్ రెహమాన్, 10న సంగీత దర్శకుడు ఇళయరాజా కార్యక్రమం కొనసాగనుంది.

17 రోజులు దసరా సెలవులు



నాడహబ్బ దసరాను పురస్కరించుకుని విద్యాశాఖ 17 రోజుల సెలవు ప్రకటించింది. అక్టోబరు 3నుంచి 20వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఒకే విధమైన మార్గదర్శకాలు రూపొందించారు. గతంలో తీర ప్రాంత జిల్లాల్లో మార్పులు ఉండేవి. అయితే ఈసారి ఒకే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వర్తింపచేసేలా ఆదేశించారు. అక్టోబరు 21నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో అక్టోబరులో కేవలం 11 రోజులు మాత్రమే పాఠశాలలు కొనసాగనున్నాయి. దసరా ఉత్సవాలు వీక్షించేందుకు ప్రత్యేక బస్సు సదుపాయాలను కల్పిస్తున్నారు.

ఏనుగులతో రీల్స్‌కు అవకాశం లేదు

దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఏనుగులతో కొందరు రీల్స్ చేసేందుకు, ఫొటోషూట్‌లకు ప్రయత్నిస్తుండడాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రీల్స్, ఫొటోషూట్‌లకు అవకాశం ఉండదన్నారు. కొందరు యూట్యూబర్‌లు ఏనుగు దంతాలు, తొండం పట్టుకుని ఫొటో షూట్ చేసుకున్నారని అవి తిరగబడితే పెను ప్రమాదమని అధికారులు హెచ్చరిస్తున్నారు. వీటిని అతిక్రమించరాదని, నిబంధలనలు తప్పితే చర్యలు తప్పవన్నారు. ప్రజలు సంబరాలు చూసి ఆనందించాలే కానీ వివాదాలకు తావీయరాదన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.94	1,619.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,980	3,455
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,153	9,885
సామర్థ్యం (టీఎంసీలు)	101.54	60.91

పైకప్పు పెచ్చులూడి చిన్నారులకు గాయాలు



అంగవాడీ కేంద్రం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

గంగావతి రూరల్, సెప్టెంబరు 24: కొప్పళ జిల్లా గంగావతి పట్టణంలోని మెహబూబ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు పెచ్చులూడి చిన్నారులపై పడడంతో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. సోమవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి 20మంది చిన్నారులు వచ్చారు. 10.30గంటల సమయంలో ఉన్న ఫళంగా పైకప్పు పెచ్చులూడి చిన్నారులపై పడడంతో వారి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. చిన్నారుల్లో అమన్, మన్విత్, మర్దన్, సురక్షాలు గాయపడ్డారు. గాయపడిన వారిని గంగావతి తాలూకా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పడంతో చిన్నారుల తల్లితండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు, అధికారులపై చిన్నారుల తల్లితండ్రులు ఆక్రోశం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నగరసభ అధ్యక్షులు, సభ్యులు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అంగనవాడీ కేంద్రం పాతదేమి కాదని, నిర్మాణం పనులు నాసిరకంగా జరిగడమే ఘటనకు కారణమైందన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

రొమ్ము క్యాన్సర్‌కు భయపడవద్దు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ,సెప్టెంబరు 24: గర్భాశయం, రొమ్ము క్యాన్సర్‌తో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని, దీనికి భయపడాల్సిన పనిలేదని దీనిపై అవగాహన ముఖ్యమని జిల్లా ఎస్పీ శోభారాణి అన్నారు. బళ్లారిలోని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా పోలీసుల సహకారంతో సోమవారం మహిళా పోలీస్‌సిబ్బందికి గర్భాశయ రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రొమ్ము క్యాన్సర్ వల్ల 77శాతం మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. అంటే భారతదేశంలో ప్రతి 8నిమిషాలకు ఒక మహిళ ఎండోమెట్రీయల్ క్యాన్సర్‌తో మరణిస్తోందని, అందుకే అవగాహన, పరిశీలన ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు టీ.జీ.విఠల్ మాట్లాడుతూ తమసంస్థ 75సంవత్సరాలుగా వైద్య సేవలు అందజేస్తోందని, తమది లాభాలను ఆర్జించే సంస్థ కాదని, కేవలం ఆరోగ్య సంరక్షణ కోసమే పనిచేస్తున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గర్భాశయ క్యాన్సర్‌ను కచ్చితంగా గుర్తించి అతి తక్కువ ఖర్చుతో దాని స్ర్కీనింగ్‌ను అందించే వ్యవస్థ ఇందులో ఉందన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ ప్రణీత అజయ్ మాట్లాడుతూ, గర్భాశయ క్యాన్సర్ ఎలా వ్యాపిస్తుందో వివరించారు. అది జరగకుండా నిరోధించే హెపీవీ వ్యాక్సిన్ గురించి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సిరుగుప్ప, సెప్టెంబరు 24: బీజేపీ సీనియర్ నాయకులు ధరప్పనాయక ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డుమార్గంలో ఫోన్ యాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూలెప్ప, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఫోన్ యాప్ ద్వారా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న దృశ్యం

ప్రసాదాలపై తిరుపతి లడ్డూ ఎఫెక్ట్





ఇకపై అన్ని స్థానిక ఆలయ ప్రసాదాల్లో నందిని నెయ్యి

● దేవాదాయశాఖ ఆదేశాలు



అంజనాద్రి బెట్టలో భక్తుల కోసం సిద్ధం చేస్తున్న ప్రసాదం లడ్లు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూ ఎఫెక్ట్ కర్ణాటక దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాలపై పరోక్షంగా ప్రభావం చూపుతోంది. తిరుమల తిరుపతి పాలక మండలి తిరుపతి లడ్డూ తయారీలో నందిని నెయ్యినే ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కూడా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల్లో భక్తులకు పంపిణీ చేసే లడ్డూల నాణ్యతపై దృష్టిపెట్టింది. అందులో భాగంగానే ఉత్తర కర్ణాటక ప్రాంతంలో శక్తిదేవతగా పేరొందిన హులిగమ్మ దేవి దేవస్థానం, గంగావతిలోని అంజనాద్రి, కనకగిరి కనకచలపతి దేవాలయాల్లో భక్తులకు అమ్ముతున్న లడ్డూ ప్రసాదం తయారీలో నందిని నెయ్యిని మాత్రమే ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో హులిగమ్మ దేవాలయం పాలనాధికారులు లడ్డూ తయారీలో క్వాలిటీ విషయంలో అవసరమైన చర్యలు చేబడుతున్నారు. హులిగమ్మ దేవి దర్శనం కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం, పౌర్ణమి రోజుల్లో లక్షలాది మంది భక్తులు వస్తారు. భక్తులు దేవిని దర్శనం చేసుకున్న అనంతరం లడ్డూను ప్రసాదంగా ఇంటికి తీసుకువెళతారు. సామాన్య రోజుల్లో రెండువేల లడ్లు ఖర్చు అవుతున్నట్లు దేవాలయం పాలక మండలి అధికారులు తెలుపుతున్నారు. హులిగి దేవాలయంలో ఒక వారానికి 30టిన్నుల నందిని నెయ్యి కొనుగోలు చేస్తున్నట్లు, అధికారులు తెలిపారు. అదే రీతిలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చిన భక్తులకు అంజనాద్రి బెట్టలో హనుమ జయంతి, హనుమమాలా విసర్జన సమయంలో లడ్డూ, తీర్థం బాటిల్‌ను భక్తులకు అందజేస్తున్నట్లు, పాలకమండలి పేర్కొంటోంది.

గ్రాంటు విడుదలలో అన్యాయం



నారా ప్రతాప్‌రెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 24: కల్యాణ్ కర్ణాటక డెవలప్ మెంట్ బోర్డు అభివృద్ధి గ్రాంటుల విడుదలలో తీవ్ర అన్యాయం చేస్తోందని మాజీ బుడా అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తనకార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పరంగా అన్ని పార్టీలు మౌనంగా ఉన్నాయని అందుకే అనేక మందితో కలిసి నిరాహార దీక్ష చేపడుతామన్నారు. సెప్టెంబరు 17న కల్బుర్గిలో జరిగిన సమావేశంలో అభివృద్ధికి ఐదు వేల కోట్ల రుపాయలు ఇస్తున్నామన్నారన్నారు. ఇందులో కల్బుర్గి, బీదర్ జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుకు రూ.7200 కోట్లు మంజూరు చేశారని, బీదర్, కల్బుర్గి , యాదగిరి జిల్లాలకు మాత్రమే కల్యాణ్ కర్ణాటక అని, అందుకే కల్యాణ్ కర్ణాటక అని కాకుండా కల్బుర్గి కర్ణాటక డెవలప్ మెంట్ బోర్డు అనే పేరుతో పిలవాలని అన్నారు. విమ్స్‌కు ఎంఆర్‌ఐకీ రూ.10.50కోట్లు, బళ్లారి గుడ్డకు(కొండ) డార్మిటరీకి రూ.25కోట్లు, కమలాపుర్ డార్మిటరీకి, హంపి సౌండ్‌లైట్‌లకు రూ.25కోట్లు మాత్రమే కేటాయించారని, మరే ఇతర ప్రాజెక్టులకు మంజూరు చేయడం లేదన్నారు. బళ్లారి జిల్లాకు రింగ్‌రోడ్డు లేదని, మిర్చి మార్కెట్‌లేదన్నారు. జిల్లా అభివృద్ధి పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సవతి తల్లి వైఖరికి నిరసనగా ఒక రోజు డీసీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామన్నారు.

బళ్లారిలో మరో క్లాక్‌టవర్ నిర్మాణం

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 24: సాధారణంగా మహానగరాలు.. నగరాలకు ప్రధాన కూడళ్లలో నిర్మాణాలు జరపడం ఆనవాయితీ.. భారత దేశంలో మొట్టమొదటి సారిగా ఢిల్లీ నగరంలో 1870లోటవర్‌క్లాక్ నిర్మాణం కాగా... ఆ పరంపర భారత దేశంలో పలు పట్టణాల ప్రధాన కూడళ్లలో కూడా జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే.. బళ్ళారి నగరంలో గడిగె చెన్నప్ప(రాయల్ సర్కిల్)లో ఐదు దశాబ్దాల క్రితం నిర్మితమైన టవర్‌క్లాక్ వివిధ కారణాల వల్ల నేల కూలగా... దానిస్థానంలో సుమారు రూ 5కోట్లకుపైగా వెచ్చించి 100 అడుగుల ఎత్తులో బృహత్ టవర్‌క్లాక్ నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరం ఆగస్టులో ప్రారంభమైన ఈ టవర్‌క్లాక్ నిర్మాణం పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. అన్నీ సక్రమంగా జరిగితే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కొత్త క్లాక్ టవర్‌ను ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా... రూరల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఫస్ట్‌గేట్, కౌల్‌బజార్ మెయిన్ రోడ్డు, స్టేడియం వెళ్ళే దారిలో మహాత్మాగాంధీ నగర వికాస యోజన క్రింద సుమారు 4కోట్ల వ్యయంతో మరో టవర్‌క్లాక్ నిర్మాణమవుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బళ్లారి రూరల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బి.నాగేంద్ర టవర్‌క్లాక్ పనులకు గత ఏడాది భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రాయల్ సర్కిల్‌లో నిర్మాణమవుతున్న క్లాక్‌టవర్ 100 అడుగులు కాగా, కౌల్‌బజార్ ప్రాంతంలో 52అడుగుల ఎత్తులో టవర్‌క్లాక్ నిర్మాణానికి కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బహుశా వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం రోజు నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కౌల్‌బజార్ ఫస్ట్‌గేట్ వద్ద నిర్మాణదశలో ఉన్న క్లాక్‌టవర్...

వినాయక నిమజ్జనంలో ఘర్షణ.. నలుగురికి గాయాలు

గంగావతి రూరల్, సెప్టెంబరు 24: వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గంగావతి పట్టణంలో సోమవారం రాత్రి నిర్వహించిన శోభా యాత్రలో అపశృతి చేటుచేసుకుంది. రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ఒకరిపై కత్తులతో దాడిచేసుకోవడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో అంబేడ్కర్ నగర్‌కు చెందిన శివుడికి కత్తిపోట్లు ఎక్కువగా తగలడంతో ఉన్నత చికిత్స కోసం అతడిని హుబ్లీకి తరలించారు. మిగిలిన గణేష్, మంజు, సాగర్‌లు స్థానికంగా చికిత్స పొందుతున్నారు. గుండమ్మ క్యాంపులో గణేష్ మండలి ద్వారా 17వ రోజున గణేష్ విగ్రహం విసర్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ధ్వనివర్ధకాలతో శోభాయాత్ర వీధుల గుండా తరలి వెళుతున్న సమయంలో ఉన్న ఫలంగా రెండు గుంపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. అది చిన్నగా మొదలై... ఆఖరికి కొత్తిపోట్ల వరకు చేరుకుంది. శోభాయాత్రలో ఎక్కువగా యువకులు ఉన్న కారణంగా... దాడికి పాల్పడింది ఎవరనే విషయంపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ముత్తణ్ణ, ధర్మణ్ణ, బాబు, వెంకటేష్, జంభలతోపాటు మొత్తం 20మందిని గంగావతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కత్తిపోట్ల కారణంగా గాయపడి చికిత్స పొందుతున్న నలుగురు యువకులు..

షెడ్యూల్డ్ వర్గాల ఫిర్యాదులపై స్పందించండి

షెడ్యూల్డ్ కులాల సమావేశంలో కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 24: వివిధ శాఖల అధికారులు షెడ్యూల్డ్ వర్గాల ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యకు సత్వరపరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. అనంతపురం రోడ్డులోని జిల్లాపాలనా భవనం హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘాల సమస్యల పరిష్కార సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సమస్యలను విని వాటికి పరిష్కారం చేపేందుకు జిల్లా పరిపాలన, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకోసారి షెడ్యూల్డ్ వర్గాల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు త్రైమాసిక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కాలనీల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తారని, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. భూరికార్డుల పరిరక్షణ చట్టం కింద జిల్లాలోని 5 తాలూకాల భూ రికార్డులను స్కాన్ చేసి కంప్యూటర్‌లో అప్ లోడ్ చేసి భద్రపరుస్తున్నామన్నారు. ఇప్పటికే 25లక్షల డాక్యుమెంట్లను స్కాన్ చేశామన్నారు. ఆరు నెలల్లో ప్రతి పత్రం జిరాక్స్ కాపీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. బళ్లారి తాలూకాలోని కొన్ని గ్రామాల్లో రుద్రభూమి లేదని, కొన్ని చోట్ల రుద్రభూమికి రోడ్డు లేదని వాటిని పరిష్కరించేందుకు అధికారులు సంకల్ప బలం చూపాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ వర్గాలకు చెందిన వారు నమోదుచేసిన అట్రాసిటీ కేసులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలు సమస్యలను విన్న జిల్లాకలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. పోలీస్ ఎస్పీ శోభరాణి మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగలపై హింస, కుల దూషణలు ఇతర కేసులు నమోదైతే అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లోపాలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా పంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప,సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, వివిధ దళిత సంఘాల పదాధికారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్

మాకు న్యాయం చేయాలి

● సరుకు తీసుకుని అగ్రి కంపెనీ డబ్బు ఇవ్వలేదని ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 24: కురుగోడు తాలుకా సోమసముద్రం గ్రామానికి చెందిన 28 మంది రైతుల నుంచి మిర్చి పంటను అగ్రిగ్రిడ్ కంపెనీ కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా రూ. 1.50 కోట్లు మోసం చేసిందని రైతు నాయకులు హనుమంతప్ప కలెక్టర్‌కు మనవిపత్రం సమర్పించారు. రైతులను మోసం చేసిన అగ్రిగ్రిడ్ కంపెనీ నుండి తమకు డబ్బులు అందించేలా చూడాలని కోరారు.రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ దీనికి కారణం చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలుకా గడ్డ హోబనహళ్లికు చెందిన అశోక్, రమేష్‌కుమార్, రిటైర్డ్ డీసీ శివమూర్తి, ఆషారాణి కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, హనుమంతప్ప, మల్లికార్జున, సింధిగేరి గోవిందప్ప, శ్రీనివాస నాయక్, గడ్డం తిమ్మప్ప, గోవిందప్ప, శివకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ తుకారామ్

తోరణగల్లు, సెప్టెంబరు 24: సండూరు తాలుకా పరిధిలో ఎంపీ తుకారామ్ వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. అల్పసంఖ్యాక కళ్యాణ ఇలాఖె, యశ్వంత్‌నగర్ గ్రామంలో షాదీ మహల్ నిర్మాణం, కాంపౌండ్ నిర్మాణం, ఇతర మౌళిక సౌకర్యాలు, యశ్వంత్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీలకు భూమిపూజ, త్యాగదల్ గ్రామంలో సీసీ రోడ్డుకు భూమిపూజ, రూ. 40 లక్షల వ్యయంతో త్యాగదల్ జాగనహళ్లి చోర్నూరు వరకు సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సండూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్, ప్రముఖులు జయరామప్ప, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు

సిట్టింగ్ త్రోబాల్‌కు ఎంపికైన మంజుల

కంప్లి, సెప్టెంబరు 24 : హగరి బొమ్మనళ్లి తాలుకా హంపపట్టణ పంచాయతీ పరిధిలోని వ్యాసాపుర తాండాకు చెందిన దివ్యాంగురాలైన మంజుల సిట్టింగ్ త్రోబాల్‌కు ఎంపికైంది. ఈ నెల 21 నుంచి జార్ఖండ్ రాంచి కోలాగామ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సిట్టింగ్ త్రోబాల్ పోటీల్లో ఆమె పాల్గొంటారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా మంజుళ ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



మంజుల

గర్భిణులు జాగ్రత్త వహించాలి

కంప్లి, సెప్టెంబరు 24 : గర్భం దాల్చిన ప్రతి మహిళ జాగ్రత్తలు వహించకపోతే ముప్పు తప్పదని డీహెచ్‌వో డాక్టర యల్ల రమేష్‌బాబు తెలిపారు. కంప్లి పట్టణంలో షుగర్ ఫ్యాక్టరీలోని కోదండరామ దేవస్థానంలో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రతి మహిళ గర్భం దాల్చిన వెంటనే తగిన మందులు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో ప్రసవం చేయించుకోకుండా దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లాలన్నారు.

హోసూరు జోన్

చెల్లని పట్టాలు ఇచ్చినందుకు రాస్తారోకో



నిరసన తెలుపుతున్న భారతీయార్ నగర్ ప్రాంత వాసులు

హోసూరు, సెప్టెంబరు 24: హోసూరు భారతీయార్ నగర్ వాసులు మంగళవారం తమకు చెల్లని పట్టాలు ఇచ్చారని నిరసన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో 500కు పైగా ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ నివసించే వారంతా కూలీ పనులకు వెళ్తుంటారు. వారి ఇళ్లకు డీఎంకే ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. కాని ఆ పట్టాలను తాలూకా కార్యాలయానికి తీసుకెళ్తే అవి చెల్లుబడి కావని తెలుపడంతో దీనిని ఖండిస్తూ ఆ ప్రాంత ప్రజలు నిరసన చేపట్టారు, ఈ పట్టాలను ఎక్కడికి తీసుకెళ్లినా ఇవి పట్టాలు కావని తెలుపడంతో ప్రజలందరూ న్యాయం కావాలని తాలూకా కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఆవలపల్లి రోడ్డుల్లో 200 మందికి పైగా రాస్తారోకోలో పాల్గొన్నారు, సమాచారం అందుకున్న హడ్కో ఇన్‌స్పెక్టర్ ముత్తమిళ సెల్వన్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో మాట్లాడి శాంతింపజేశారు.

ధర తగ్గిన క్యాబేజీ.. రైతుల ఆవేదన

హోసూరు సెప్టెంబరు 24: హోసూరు పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తున్న క్యాబేజీ (కోసు)కి ప్రస్తుతం ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఎకరం విస్తీర్ణంల్లో సాగుకు లక్ష రూపాయల వరకు ఖర్చువుతుండగా దిగుబడి బాగా ఉన్నా కనీస ధర లేక పెట్టుబడి కూడా అందడం లేదని వాపోతున్నారు.



లాభాల బాటలో దమ్మూరు సహకార సంఘం

కంప్లి, సెప్టెంబరు 24: కురుగోడు పరిధిలోని దమ్మూరు ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం 2023-24 సంవత్సరం నాటికి రూ. 7.45 లక్షలు లాభాల బాటలో కొనసాగుతోందని కార్యదర్శి రేవణ సిద్దయ్య తెలిపారు. దమ్మూరులో ప్రాథమిక కృషి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2023-24 సంవత్సరం నాటి లావాదేవీలను రేవణ సిద్దయ్య చదివి వినిపించారు. సంఘంలో 2402 మంది సభ్యులు వుండగా 1950 ఏసీసీ రైతులకు రుణాలు ఇప్పించామన్నారు. అలాగే 855 మంది జీరో వడ్డీతో రుణాలు ఇచ్చామన్నారు. మొత్తం మీద రైతులు, ఖాతాదారుల వల్ల తమ సహకార సంఘం అభివృద్ధి బాటలో కొనసాగుతోందన్నారు. అలాగే రైతులకు ఆరోగ్య భీమా కూడా చేయించామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శంకర్‌గౌడ, ఉపాధ్యక్షులు సిద్దరామయ్య, మంజునాథరెడ్డి, సుగ్రీవప్ప, మంజునాథ్, దేవన్న, అన్నపూర్ణ, దాసరి మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

దసరాపై పూల రైతుల ఆశలు

హోసూరు, సెప్టెంబరు 24: హోసూరు పూల మార్కెట్‌లో మంగళవారం పూల ధరలు తగ్గుముఖం పట్టాయి. వచ్చే దసరాకు పూల ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. పూలమార్కెట్‌కు తిరువణ్ణామలై, వేలూరు, మదురై, సేలం, కృష్ణగిరి, అంచెట్టి, శూలగిరి, బాగలూరు, బేర్కై, రాయకోట, తళి, సరిహద్దులోని అత్తిబెలె, చందాపుర, ఆనేకల్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 టన్నుల పూలు వస్తుంటాయి. ఇక్కడి నుంచి కర్ణాటక, ఆంధ్ర సహ పలు రాష్ట్రాలకు పంపుతున్నారు. గుండుమల్లి రూ.160, నుంచి రూ.200 వరకు పలుకుతోంది. దసరాలో ప్రధానమైన ఆయుధపూజలకు పూలవాడకం అధికంగా ఉంటుంది. దసరా పండుగకు ఇప్పటి రేటుకు మూడింతలు పలుకుతుందని భావిస్తున్నారు.



పౌర కార్మికులకు ఆటల పోటీలు

కంప్లి, సెప్టెంబరు 24 : పౌర కార్మికుల దినోత్సవం సందర్భంగా మరెమ్మనహళ్లి గ్రామంలో పౌర కార్మికులకు పలు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హుస్సేన్‌బాషా మాట్లాడుతూ పౌరకార్మికులు ఉదయాన్నే పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచడం వల్లనే ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా వుంటున్నామన్నారు. పౌర కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మ్యూజికల్ చైర్స్, గాలిపటాలు, కాలినడక పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చామన్నారు.



మరెమ్మనహళ్లిలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న పౌర కార్మికులు

సాగునీరు ఇవ్వకపోతే మంత్రుల పర్యటన అడ్డుకుంటాం

రాయచూరు సెప్టెంబర్ 24: తుంగభద్ర ప్రధాన ఎడమ కాలువ, నారాయణపూర్ కుడి కాలువ పరిధిలోని రైతులకు సక్రమంగా సాగునీరందించకపోతే జిల్లా పర్యటనలకు వచ్చే మంత్రులను అడ్డుకుని నిరసన తెలుపుతామని రైతు సంఘం,హసిరుసేనల గౌరవధ్యక్షుడు అధ్యక్షుడు చామరస మాలిపాటీల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మునిరాబాద్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తెచ్చామని ఈ విషయంలో ముఖ్యమంత్రి తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి హామి ఇవ్వడం స్వాగతార్హమన్నారు. అదే సమయంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ స్వయాన తాను జలవనరుల శాఖ మంత్రిగా ఉండికూడా రైతు సమస్యల పట్ల చులకనగా మాట్లాడడం బాధ్యతరాహిత్యమన్నారు.



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత

రాయచూరు సెప్టెంబర్ 24 : జిల్లాలోని అరకెరా తాలూకా ఆల్కోడు వద్దగల కస్తూరుబా బాలికల విద్యాలయం విద్యార్థినుల మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా చిత్రాన్నం తిన్న కొద్దిసేపటికి పలువురు విద్యార్థులు తలనొప్పి, వాంతులతో ఇబ్బంది పడుతుండగా దాన్ని గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందచేశారు. 10 మందికిపైగా విద్యార్థినులు వాంతులు చేసుకోవడంతో వెంటనే వారిని దేవదుర్గ ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ (జయంతి)




ప్రముఖ మేధావి, రాజకీయనేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబరు 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధురలో జన్మించారు. హిందూత్వ భావాలను ప్రచారం చేసేలా ఆర్ఎస్ఎస్‌కు అనుబంధమైన 'రాష్ట్ర ధర్మ' మాసపత్రికను 1940లో స్థాపించారు. భారతీయ జన సంఘ్ (బీజేఎస్)లో ప్రముఖ నేతగా ఎదిగి పదో అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనంతరం భారతీయ జనతా పార్టీగా మారింది. 1968 ఫిబ్రవరి 11న కన్నుమూశారు. కాగా 2020 ఫిబ్రవరి 16న 63 అడుగుల భారీ విగ్రహాన్ని వారణాసిలో ఆవిష్కరించారు.

ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి (జయంతి)




'పద్మభూషణ్ గ్రహీత కొత్త సచ్చిదానందమూర్తి 1924 సెప్టెంబరు 25న గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించారు. ఫిలాసఫీ (తత్వశాస్త్ర) ప్రొఫెసర్‌గా విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో పనిచేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీకి వైస్-ఛాన్సెలర్‌గా, యూజీసీ వైస్‌ఛైర్మన్‌గాను వ్యవహరించారు. ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత. విద్య, సాహిత్య సేవలకుగాను పద్మశ్రీ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2011 జనవరి 25న కన్నుమూశారు.

క్రిస్టోఫర్ రీవ్ (జయంతి)



అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు క్రిస్టోఫర్ రీవ్ 1952 సెప్టెంబరు 25న న్యూయార్క్‌లో జన్మించారు. డిసి కామిక్స్ కేరక్టర్ 'సూపర్‌మ్యాన్'తో పేరొంది బీఏఎఫ్‌టీఏ అవార్డు అందుకున్నారు. అంతేకాక రచయితగా, అథ్లెట్‌గా రాణించారు. గుర్రపుస్వారీ ప్రమాదంతో చాలాకాలం వీల్‌చెయిర్‌కే పరిమితమయ్యారు. వెన్నెముక బాధితులను ఆదుకునేలా ప్రత్యేక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. 2004 అక్టోబరు 10న కన్నుమూశారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ (వర్ధంతి)



గాంధేయవాది, సంఘ సంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ 1877 డిసెంబరు 4న గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరు గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడిగా పేరొందారు. సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేసిన న్యాయవాది. కవిత్వం ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్నది ఉన్నవ అభిలాష. ఆయన రచించిన 'మాలపల్లి' నవల సంచలనం సృష్టించింది. 1958 సెప్టెంబరు 25న కన్నుమూశారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం (వర్ధంతి)




ప్రముఖ నేపథ్యగాయకుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4న నెల్లూరులో జన్మించారు. ఎస్పీబీగాను, బాలుగాను సుపరిచితులు. గాయకుడిగానే కాక సంగీత దర్శకుడు, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బుల్లితెర కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 40 వేలకు పైగా పాటలు పాడారు. 6 జాతీయ పురస్కారాలు, 25 నంది అవార్డులు, పద్మశ్రీతోపాటు పలు ఫిల్మ్‌ఫేర్, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ విభూషణ్' ప్రకటించారు.

పరుచూరి గోపాలకృష్ణ (పుట్టినరోజు)



'పరుచూరి బ్రదర్స్'లో ఒకరైన చిన్నవారు పరుచూరి గోపాలకృష్ణ 1947 సెప్టెంబరు 25న కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామంలో జన్మించారు. అన్న వెంకటేశ్వరరావుతో కలసి 350కు పైగా తెలుగు సినిమాలకు కథ, స్క్రీన్ ప్లే అందించారు. దర్శకత్వం చేసిన తొలి సినిమాకే నంది అవార్డు అందుకున్నా ఎన్టీఆర్ సలహా మేరకు రచనారంగానికే పరిమితమయ్యారు. వర్ధమాన రచయితలకు బోధనలు చేస్తున్నారు. జీవితసాఫల్య పురస్కారం సహా పలు అవార్డులు అందుకున్నారు.

రాహుల్ శర్మ (పుట్టినరోజు)



సంగీత దర్శకుడు, క్లాజికల్ సంతూర్ వాయిద్యకారుడు రాహుల్ శర్మ 1972 సెప్టెంబరు 25న ముంబైలో జన్మించారు. తండ్రి శివకుమార్ శర్మ వద్దనే సంగీతం నేర్చుకున్నారు. 'నమస్తే ఇండియా' ఆల్బమ్ ఎంతో పేరొందింది. 60కుపైగా ఆల్బమ్స్ రూపొందించారు. జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో కలసి పనిచేశారు. 1996 నుంచి కచేరీలు ప్రదర్శిస్తున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

గుత్తి, సెప్టెంబరు 24: అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైల్లో నుంచి జారి పడి కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లికార్జున(28) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. యాదగిర్ జిల్లా కణేకల్లుకు చెందిన మల్లికార్జున భార్య, పిల్లలతో కలిసి బెంగళూరులో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంలో బంధువు చనిపోవడంతో వెళ్లాడు. అక్కడ దినాలు పూర్తి చేసుకుని చెల్లెలతో మాట్లాడి, బెంగళూరుకు నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరాడు. జనరల్ బోగీలో ప్రయాణిస్తుండగా తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కింద పడి మృతి చెందాడు. గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, తన సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వానలేక దెబ్బతిన్న పంటలు

» అన్నదాతల్లో ఆందోళన

బాగేపల్లి, సెప్టెంబరు 24: బయలుసీమలోని బాగేపల్లి తాలూకాలో వర్షంలోటు అన్నదాతలను వెంటాడుతోంది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షం కురవగా సంబరపడిన రైతులు అందుకు అనుగుణంగా నాట్లు వేశారు. తాలూకా ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, టమోటా వంటి పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం వేరుశనగ, మొక్కజొన్నపంటలు ఎండిపోతున్నాయి. అదునుకు వర్షం కురవకపోవడంతో మొక్కజొన్న పంటకు కంకులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వేరుశనగ పంట కాయలు ఇంకా పిందెదశలోనే ఉన్నాయని ఎండిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. తాలూకాలోని గూళూరు హోబళి పరిధిలో వర్షంలోటు కారణంగా పంటలు ఎండిపోతుండడాన్ని చూపుతూ పలువురు రైతులు తమగోడు వెళ్లబోసుకున్నారు. గూళూరు హోబళి ఐవారపల్లికి చెందిన మంగమ్మ మాట్లాడుతూ ఖరీఫ్ ఆరంభంలో పంటకు తగినంత వర్షం కురిసిందని తర్వాత వర్షాలు కురవలేదన్నారు. మొక్కజొన్న పంటకు వేలరూపాయలు ఖర్చు చేశామని అయితే వర్షాలు కురవక ఎండిపోతున్నాయన్నారు. మరో రైతు రంగారెడ్డి కూడా పంటలు ఎండిపోయాక వర్షం కురిసినా ప్రయోజనం ఉండదన్నారు. ఇలా పలువురు రైతులు విచారం వ్యక్తం చేశారు.





ఎండిపోతున్న మొక్కజొన్న, ఎండిన వేరుశనగ పంట చూపుతున్న రైతులు

కుటుంబ బాంధవ్యాలతో విజయం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 24: ఏరంగంలో పనిచేసేవారైనా తమ విధులకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలో అదే విధంగా తన కుటుంబానికి ఇవ్వాలని కార్యనిరత పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం జయరాం అభిప్రాయపడ్డారు. జిల్లా కార్యనిరత పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు కేవీ మునేగౌడ, భారతమ్మ దంపతులను ఆత్మీయంగా సత్కరించి, ప్రతిభా పురస్కారం అందచేసి మాట్లాడారు. ఇటీవలికాలంలో విధులలో ఒత్తిడి అధికమైందని తద్వారా వారు తమ కుటుబాల పట్ల ఎక్కువగా దృష్టి సారించలేకపోతున్నారన్నారు. ఇది జీవితంలో విజయానికి అడ్డుగా ఉందన్నారు. కుటుంబంతో ఉత్తమ బాంధవ్యాలు ఉన్నప్పుడే తమ రంగంలోనూ విజయం సాధించగలరన్నారు. ఈసందర్భంగా రాష్ట్రసమితి సభ్యుడు వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు కాగతి నాగరాజ్, జగదీశ్‌బాబు, శిడ్లఘట్ట తాలూకా వీరాపుర మంజునాథ్, ప్రధాన కార్యదర్శి ఛాయా రమేశ్, ఉపాధ్యక్షుడు ఏ శశికుమార్, ఈసీ సభ్యుడు మల్లికార్జున్, కరగప్ప, తాలూకా మాజీ అధ్యక్షుడు కే నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ పాత్రికేయుడు మునేగౌడకు సన్మానం

ప్రతిభా పురస్కారాల ప్రదానం

బంగారపేట, సెప్టెంబరు 24: అఖిల కర్ణాటక హెళవ సామాజికవర్గం కోలారు జిల్లా విభాగం ఆధ్వర్యంలో నాల్గో వార్షిక ప్రతిభా పురస్కారాలను బంగారపేట పట్టణంలోని కనకభవనంలో ప్రదానం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి శ్రీనివాస్ మాట్లాడుతూ హెళవ సమాజం అతితక్కువ జనాభా ఉన్నారని, రాష్ట్రంలో తమ సామాజికవర్గం బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సౌలభ్యాలను పొందడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాల్సి ఉందన్నారు. రాజకీయంగాను తమ సామాజికవర్గం అభివృద్ధి సాధించాలన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేసి సన్మానించారు. ప్రోత్సాహకాలు అందించడం ద్వారా విద్యార్థులు మరింత రాణిస్తారన్నారు. కోలారు జిల్లా హెళవ సామాజికవర్గం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ పివి, బంగారపేట అధ్యక్షుడు వెంకటేశ, సభ్యులు శ్రీరామ, సతీశ్, మురళి, శివకుమార్, సామాజికవర్గం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలతో విద్యార్థులు, నిర్వాహకులు

భవన నిర్మాణ కార్మికుల నిరసన



వినతిపత్రం అందజేత

బాగేపల్లి, సెప్టెంబరు 24: కార్మికశాఖ ద్వారా అందాల్సిన సౌలభ్యాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూర్యోదయ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంఘం ఆంజనేయరెడ్డి నేతృత్వంలో ధర్నా చేపట్టారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కార్మిక కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్మికుల పేరిట కొంతమంది బోగస్‌కార్డులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి మాత్రమే కార్మికశాఖ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సంజీవిని పథకాన్ని కట్టడ కార్మికులకు కూడా అన్వయించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సహాయధనం ఇవ్వాలన్నారు. తాలూకా స్థాయిలో కార్మిక సంక్షేమ సురక్షాభవనం నిర్మించాలన్నారు. కార్మికశాఖ అధికారి రాకేశ్ మాట్లాడుతూ 11వేల మంది కట్టడ నిర్మాణ కార్మికులు నమోదు చేసుకున్నారని ఇటీవలే 650 కార్డులను రద్దు చేశామన్నారు. బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలూకాల పరిధిలో ఎలక్ట్రానిక్ పనిచేసే కార్మికులకు కార్మికశాఖ ద్వారా 120 కిట్‌లు వచ్చాయని త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. నిరసనలో తాలూకా పట్టణ సమితి అధ్యక్షుడు లక్ష్మీపతి, బిళ్ళూరు సమితి అధ్యక్షుడు మంజునాథ్, మన్సూర్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

నగరసభ అధ్యక్షురాలిగా సుమిత్రా ఆనంద్

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 24: నగరసభ అధ్యక్షురాలిగా బీజేపీకి చెందిన సుమిత్రా ఆనంద్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ వ్యూహం ఫలించి బీజేపీ-జేడీఎస్ కూటమికి పగ్గాలు దక్కాయి. నగరసభ రెండో అవధికి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎమ్మెల్యే వ్యూహంతో బీజేపీ-జేడీఎస్ మైత్రి మరోసారి పగ్గాలు చేపట్టింది. 31 సంఖ్యాబలం ఉన్నా 23 ఓట్లు పొంది కూటమి గెలుపొందింది. నగరసభ రెండో అవధికి అధ్యక్షస్థానాన్ని జనరల్ మహిళకు, ఉపాధ్యక్షస్థానాన్ని జనరల్ కేటగిరీకి కేటాయించారు. అధ్యక్షస్థానానికి బీజేపీ-జేడీఎస్ కూటమి నుంచి సుమిత్రా ఆనంద్ పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి రూపిణి మంజునాథ్ పోటీ చేశారు. ఉపాధ్యక్ష స్థానానికి జేడీఎస్‌కు చెందిన మల్లేశ్, కాంగ్రెస్ నుంచి ఆనంద్ పోటీ చేశారు. 23 ఓట్లు పొందిన సుమిత్రా ఆనంద్ అధ్యక్షురాలిగా గెలుపొందారు. రూపిణి మంజునాథ్‌కు 10 ఓట్లు మాత్రమే దక్కి ఓటమి పాలయ్యారు. ఎంపీ డాక్టర్ కే సుధాకర్, ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్‌లు విజేతలుగా నిలిచిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వండి

విజయపుర, సెప్టెంబరు 24: మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యంపై ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్త్రీ శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ముద్దణ్ణ అభిప్రాయపడ్డారు. స్థానిక పురసభ రోజ్‌గార్ యోజనా భవనంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన మాసోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో 60ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ సమస్యలు ఉండేవన్నారు. కానీ ఇటీవల కొన్నేళ్లుగా వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీ, పురుష బేధం లేకుండా అన్నివర్గాల వారు బీపీ, షుగర్‌కు గురవుతున్నారన్నారు. పురసభ సభ్యులు నందకుమార్, సల్మాఖానంలు మాట్లాడుతూ బాలింతలు తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శిశువు ఎదుగుదలకు దోహదం కానుందన్నారు. పోషణ్ అభియాన సందర్భంగా ఏర్పాటైన అలంకరణ సభికులను ఆకట్టుకుంది.



పోషణ్ అభియానలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు

జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి..



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బంగారపేట, సెప్టెంబరు 24: పాఠశాల విద్యా సాక్షరతా శాఖ ఆధ్వర్యంలో 2023-24 జిల్లా స్థాయి వార్షిక పోటీలు జరిగాయి. నవచేతన హైస్కూల్ విద్యార్థులు నెట్‌బాల్, క్రికెట్, షాట్‌పుట్ క్రీడాపోటీల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల విద్యా సంస్థ కార్యదర్శి ఎల్ రామకృష్ణప్ప తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యకే మాత్రమే కాకుండా పాఠ్యేతర అంశాలలోనూ ప్రోత్సహిస్తున్నామన్నారు. తాలూకాస్థాయి నుంచి జిల్లా స్థాయికి, రాష్ట్రస్థాయికి అంచలంచెలుగా రాణిస్తున్నారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలకు, తాలూకాకు కీర్తి తెచ్చారన్నారు. క్రీడా పోటీల్లో సత్తా చాటిన విజేతలు రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని అభిలషించారు. నవచేతన విద్యాసంస్థ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు నాగరాజ్, కోశాధికారి రామచంద్ర, సహ కార్యదర్శి సీవీ మంజునాథ్, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, వ్యాయామ ఉపాధ్యాయుడు శివరాజ్, యశోద, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

దొడ్డగంజూరులో కొరవడిన పారిశుధ్యం

చింతామణి రూరల్, సెప్టెంబరు 24: తాలూకాలోని దొడ్డగంజూరు గ్రామంలో ఆనూరుకు వెళ్లే మార్గంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచింది. దీంతో తారురోడ్డు దుస్థితికి లోను కావడమే కాక స్వచ్ఛత కొరవడి నీరు నిల్వ అయి దుర్గంధం నెలకొంది. గ్రామపంచాయతీ అధికారులు, కంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు మండి పడుతున్నారు. డ్రైనేజీ దుస్థితిపై ఇంజనీర్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు అంటున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రెండిళ్లలో చోరీ

● రూ.2.20లక్షల నగదు, 17 తులాల బంగారం అపహరణ

తాడిపత్రి, సెప్టెంబరు 24: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని ఇగుడూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్ ఇళ్లల్లో దొంగలు చొరబడి రూ.2.20లక్షల నగదు, 17తులాల బంగారం దోచుకెళ్లారు. బాధితుల వివరాల మేరకు.. నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్, ఆదినారాయణయాదవ్ అన్నదమ్ములు. వీరు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదినారాయణ యాదవ్ కుటుంబ సభ్యులతోపాటు అన్నదమ్ములను తీసుకొని సోమవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. రెండిళ్లల్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణ యాదవ్ ఇళ్ల లోపలికి ప్రవేశించారు. నారాయణస్వామి బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, 15తులాల బంగారం నగలను దోచుకెళ్లారు. అదే విధంగా సూర్యనారాయణ ఇంటిలో ఉన్న రూ.20వేలు నగదుతోపాటు 2తులాల కమ్మలు, వెండి గొలుసులు, జుంకీలు, ఉంగరాలు దోచుకెళ్లారని తెలిపారు. ఆదినారాయణస్వామి ఇంట్లో ఉన్న తల్లి సుబ్బలక్షుమ్మ ఉదయం 11గంటల సమయంలో నారాయణస్వామి, సూర్యనారాయణ ఇళ్లల్లో ఫ్యాన్ వేసి ఉండడం గమనించింది. దొంగతనం జరిగినట్లు గుర్తించింది. వెంటనే కుమారులకు ఫోన్‌ద్వారా సమాచారం చేరవేసింది. దీంతో వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ కాటయ్యలు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

టీటీడీ ఆలయంలో 27నుంచి పవిత్రోత్సవాలు

» ఆలయశుద్ధి, తిరుమంజనం



ఆలయశుద్ధిలో భక్తులు

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరం లోని తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధమైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సేవలు జరిపారు. వయ్యాలి కావల్‌లోని ఆలయంలో మంగళవారం ఉదయం నుంచే భక్తులు, వలంటీర్లు ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈనెల 27నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. 27న ఉదయం 6.30 గంటలకు ఆచార్య వర్ణం, సాయంత్రం 7.30 గంటలకు అంకురార్పణ, వేదారంభం, కైంకర్యం, ఏకాంతసేవలు ఉంటాయి. 28, 29 తేదీలలో యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం తదితర ధార్మిక కార్యక్రమాలు, 30న కుంభ ప్రదక్షిణ, ఆచార్య బహుమానం, ఆశీర్వచనం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని స్థానిక ఏఈఓ బాలరాజు అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ వయ్యాలికావల్ ఆలయంలో లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంటుందని భక్తులు పొందవచ్చునన్నారు.

డీసీఎంకు సత్కారం



డీసీఎం డీకే శివకుమార్‌ను సత్కరిస్తున్న రాధాకృష్ణరాజు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలలో వివిధ కారణాలతో హాజరుకాని డీసీఎం డీకే శివకుమార్‌ను తెలుగు విజ్ఞాన సమితి (తెవిస) సభ్యులు సత్కరించారు. నగరంలో మంగళవారం డీసీఎం నివాసంలో సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షుడు ఆదికేశవులు నాయుడు తదితరులు డీసీఎం డీకే శివకుమార్‌ను శాలువాతో సన్మానించారు. ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. తెలుగు విజ్ఞాన సమితికి చెందిన శ్రీకృష్ణదేవరాయ కళామందిరానికు అనుబంధంగా ఉండే భామిని డిగ్రీ కళాశాల, మైదానం కోసం కేటాయించాలని వినతిని అందించారు. సమితి కోశాధికారి వరదరాజు, కార్యవర్గ సభ్యుడు కృష్ణయ్యనాయుడు ఉన్నారు.

ట్రాఫిక్ తనిఖీలు.. రూ.20వేల జరిమానా



జరిమానా వసూలు చేస్తున్న పోలీసులు

చింతామణి, సెప్టెంబరు 24: చింతామణి పట్టణ పోలీసులు ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించినవారిని తీవ్రంగా మందలించడంతోపాటు జరిమానా విధించారు. ఇలా 40కు పైగా నిబంధనలు ఉల్లంఘించిన వారినుంచి రూ.20వేల జరిమానా వసూలు చేశారు. పట్టణంలోని బెంగళూరు సర్కిల్‌లో టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ నేతృత్వంలో ఎస్సై, సిబ్బంది సోమవారం సాయంత్రం తనిఖీలు చేశారు. ఎక్కువమంది హెల్మెట్‌లు ధరించలేదని గుర్తించారు. తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు సిఫారసు చేయనున్నట్టు హెచ్చరించారు.